- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
13-05-2026

సంపుటి : 01 సంచిక :52 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 52 NAMASTEY MAHAAPRABHA



Mr.NAKKA RAJU
Chairman of Mahaaprabha

## 15 నుంచి మోదీ.. విదేశీ పర్యటన

- ఐదు దేశాల్లో పర్యటించనున్న పీఎం
- యూఏఈ నుంచి ఇటలీ వరకు..
- ఆయా దేశాల అధినేతలతో కీలక చర్చలు



న్యూఢిల్లీ, -12మే (మహాప్రభ ).
అంతర్జాతీయ వేదికపై భారత్ దౌత్య పటిమను చాటేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల పాటు ఐదు కీలక దేశాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 15వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తో ప్రారంభమయ్యే ఈ పర్యటన నెదర్లాండ్స్,

-మిగతా 3 లో

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణం

- వరుసగా రెండోసారి..
- ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, చంద్రబాబు
- వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ-ఎన్డీయే కూటమి



గౌహతి,-12మే (మహాప్రభ ).
అసోంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి

-మిగతా 3 లో




## నీట్ పరీక్ష రద్దు !

- సంచలన నిర్ణయం తీసుకున్న ఎన్టీఏ
- రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ కావడమే కారణం
- దర్యాప్తు చేస్తున్న సీబీఐ
- ఇప్పటికే పలువురి అరెస్ట్
- త్వరలోనే కొత్త తేదీలో పరీక్ష
- ఎటువంటి అదనపు ఫీజు లేకుండానే పరీక్షకు అనుమతి

న్యూఢిల్లీ, -12మే (మహాప్రభ ).
పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్య విద్యా ప్రవేశ పరీక్షకు సంబంధించి నీట్ యూజీ 2026 రద్దయ్యింది. మే మూడున నీట్ యూజీ పరీక్ష జరిగింది. ఆ పరీక్షను రద్దు చేయాలని ఎన్టీఏ నిర్ణయం తీసుకుంది. పరీక్ష పేపర్ లీక్‌పై కేంద్రం సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. పరీక్షకు సంబంధించి కొత్త షెడ్యూల్ త్వరలో విడుదల కానుంది. ఈ మేరకు ఎన్టీఏ ఒక ప్రకటన విడుదల చేసింది. వైద్య విద్యకు సంబంధించి దేశవ్యాప్తంగా మే నెల మూడున నీట్ 2026 ప్రవేశ పరీక్ష జరిగింది. ఆ పరీక్షకు సంబంధించి రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఏ కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఎగ్జామ్

-మిగతా 3 లో

## ప్రతి గింజా కొనాల్సిందే

### మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ

- కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించం
- రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగనీయద్దు
- క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా కలెక్టర్ల పర్యవేక్షణ ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్ -12మే (మహాప్రభ ).
మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును

-మిగతా 3 లో



## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ

- ఆదిలాబాద్‌లో ఆరంభించనున్న ప్రభుత్వం
- నియోజక వర్గం యూనిట్ గా స్థలాల గుర్తింపు
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్
- హైదరాబాద్‌లో ఇండ్ల స్థలాలు కలిగిన వారికి ఇళ్ల మంజూరు పత్రాలు
- అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించం
- ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్-12మే (మహాప్రభ ).
రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లా వారీగా ప్రజా ప్రతినిధులతో

-మిగతా 3 లో




## పాస్‌పోర్ట్ సూచీలో దిగజారిన భారత్

- 3 ర్యాంకులు పతనమై 78వ స్థానం
- 2006లో 71వ ర్యాంకు

న్యూఢిల్లీ -12మే (మహాప్రభ ).
మోదీ హయాంలో పలు కీలక అంతర్జాతీయ సూచీల్లో భారత్ దిగజారుతున్నది. తాజాగా హెన్లీ పాస్‌పోర్టు సూచీలో భారత్ మూడు ర్యాంకులు క్షీణించి 78వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన ఇదివరకటి సూచీలో భారత్ 75వ స్థానంలో ఉంది. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం(ఐఏటీఏ) నుంచి సేకరించిన డాటా ఆధారంగా రూపొందించే ఈ సూచీ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు వీసా లేకుండా ప్రవేశం కల్పించే సామర్థ్యం ఆధారంగా పాస్‌పోర్టులకు ర్యాంకులను ఇస్తుంది.192 గమ్యస్థానాలకు వీసారహిత ప్రవేశం కల్పిస్తూ సింగపూర్ ప్రపంచ పాస్‌పోర్టు ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉంది. దాని తర్వాత యూఏఈ,

-మిగతా 3 లో

## బేటా భగావో .. బేటా బచావో

### తెలంగాణలో ఇదే ప్రస్తుత స్లోగన్

- పోక్సో కేసులో భగీరథ్ ను అరెస్ట్ చేయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం
- ఇంతకీ భగీరథ్ పరారీలో ఉన్నాడా అంటూ పోలీసులకు ప్రశ్న



హైదరాబాద్, -12మే (మహాప్రభ ).
బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి.. పోక్సో కేసులో ఇరుక్కున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ ను పోలీసులు ఇంకా అరెస్టు చేయకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని

-మిగతా 3 లో

## అమృత్ కాలం కాదు.. విష యుగం!

- నీట్ పేపర్ లీకేజీపై ప్రతిపక్షాల ఆగ్రహం




హైదరాబాద్, -12మే (మహాప్రభ ).
నీట్-యూజీ పరీక్ష రద్దుపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. నీట్ లీకేజీ దేశ యువతపై జరిగిన నేరమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రంపై మండిపడ్డారు. ప్రధాని మోదీ చెప్తున్న అమృత కాలం.. దేశానికి విష యుగంగా మారిందన్నారు.డీఎంకే చీఫ్ స్టాలి న్ స్పందిస్తూ.. నిర్వాహణ ప్రక్రియలో ప్రతి దశలోనూ మోసం కనబడుతున్నదన్నారు. విద్యార్థులు పెద్దయెత్తున

-మిగతా 3 లో

## మధ్యవర్తిగా పాక్‌ని నమ్మలేం

### తాజా పరిస్థితులపై ట్రంప్ ఆందోళన



- అమెరికా, ఇరాన్ శాంతి చర్చలకు పాక్ వేదిక
- పాక్ వ్యవహారంపై అధికార వర్గాలకు అనుమానాలు
- ఇరాన్ పై మళ్లీ దాడులకే మొగ్గు చూపుతున్న అమెరికా
- తదుపరి కార్యాచరణపై ట్రంప్ సర్కారులో విభేదాలు

వాషింగ్టన్:-12మే (మహాప్రభ ).
ఇరాన్ - అమెరికా శాంతి చర్చల్లో మధ్యవర్తిగా పాకిస్థాన్ పోషిస్తున్న పాత్రపై అమెరికా ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల నుంచి కాపాడేందుకు ఇరాన్ సైనిక విమానాలను తన విమానాశ్రయాలలో నిలిపి ఉంచడానికి పాక్ అనుమతించిందని అమెరికన్ మీడియా కథనాలతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. కుటిల వైఖరిని కలిగిన పాక్ ను ఇక నమ్మడం నమ్మడం సరికాదని ప్రెసిడెంట్ డొనాల్డ్

-మిగతా 3 లో




## తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు


- కృష్ణా జలాలు పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయం
- ఈ నెల 14న మరోసారి సమావేశం

హైదరాబాద్ -12మే (మహాప్రభ ).
వేసవిలో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 22 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఏ రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చేయాలనే అంశంపై చర్చించి ఈ వేసవి వాటాలను బోర్డు నిర్ణయించింది. తాగునీటి అవసరాల కోసం

-మిగతా 3 లో

## ముందస్తుగానే 'నైరుతి'!

- వాతావరణ శాఖ చల్లటి కబురు
- ఈ వారం చివరి నాటికి అండమాన్‌కు: ఐఎండీ



న్యూఢిల్లీ, -12మే (మహాప్రభ ).
: దేశ ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. నైరుతి రుతు పవనాలు ఈ వారం చివరినాటికి బంగాళాఖాతం , అండమాన్, నికోబార్ సమీప ద్వీపాలకు చేరుకుంటాయని తెలిపింది. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. సాధారణంగా మే 20 నాటికి అండమాన్, నికోబార్ దీవులకు చేరుకుంటాయి. అనంతరం దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. జూన్ 1న కేరళను తాకుతాయి. భారత ఉపఖండంలో నాలుగు నెలల వర్షాకాలం ప్రారంభానికి దీనిని సూచికగా భావిస్తారు.

-మిగతా 3 లో

# మహారాష్ట్రలో ఘోరం..

-గుడి గోడ కూలి ఆరుగురు మృతి..

- 14 మందికి గాయాలు




**న్యూఢీల్లి-12 మే (మహాప్రభ ).**
మహారాష్ట్రలో దారుణం జరిగింది. ఒక దేవాలయం గోడ కూలి ఆరుగురు మరణించగా, 14 మంది గాయపడ్డారు. ఈ ఘటన మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా, జాట్ తాలూకా, మోతేవాడి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా మర్గుబాయ్ దేవి యాత్ర సందర్భంగా వేడుకలు నిర్వహించేందుకు భక్తులు గుడి ప్రాంగణంలో గుమిగూడారు.ఈ సమయంలో భారీ వర్షం, వేగంగా వీచిన ఈదురుగాలుల కారణంగా అక్కడి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో చాలా మంది భక్తులు గోడ శిథిలాల కింద చిక్కుకుపోయారు. వెంటనే స్పందించిన అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గోడ కూలడంతో గాయాలపాలై ఆరుగురు మరణించారు. మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల్ని స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ముగ్గురు స్థానిక గ్రామస్తులు కాగా, మిగతా ముగ్గురు బీజాపూర్ తాలూకాకు చెందిన వారు. మంగళవారం ఈ దేవాలయానికి ఎక్కువ మంది భక్తులు వస్తుంటారని, ఘటన జరిగిన సమయంలో 350 మందికిపైగా భక్తులు ఉన్నారని పోలీసులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు సాంగ్లి ఎస్పీ తెలిపారు.

# 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాల్సిందే'..

సీఎం విజయ్ ముందే ఉదయనిధి స్టాలిన్ హాట్ కామెంట్స్!



**న్యూఢీల్లి-12మే (మహాప్రభ ).**
తమిళనాడు శాసనసభ వేదికగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. 2023లో జాతీయ స్థాయిలో పెను వివాదానికి దారితీసిన "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" అనే తన పాత ప్రకటనను ఆయన అసెంబ్లీ సాక్షిగా మళ్లీ పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఉండగానే ఉదయనిధి ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, సనాతన ధర్మంపై తన పాత వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, దానిని నిర్మూలించాలన్న తన మాటలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలు చేస్తుండగా.. ముఖ్యమంత్రి విజయ్ ఎదురుగా కుర్చుని ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఈ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడమే కాకుండా, న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురయ్యాయి. ఇప్పుడు మళ్లీ అసెంబ్లీ ఫ్లోర్‌పై అదే అంశాన్ని లేవనెత్తడంతో ప్రస్తుతం చర్చనీయంశగా మారింది.

# బెంగుళూరు జంట వరల్డ్ రికార్డ్

11 గంటల్లో శ్రీలంక టు ఇండియా స్విమ్మింగ్..



**బెంగుళూరు:-12మే (మహాప్రభ ).**
బెంగుళూరుకు చెందిన ఐటీ ప్రొఫెషనల్స్ దానిష్ అబ్ది, వృషాలి ప్రసాదే ప్రపంచ రికార్డు సృష్టించారు. శ్రీలంక నుంచి భారత్‌కు కలిసి స్విమ్మింగ్ చేశారు. రెండు దేశాల మధ్య ఈత కొట్టిన తొలి జంటగా రికార్డు క్రియేట్ చేశారు. చరిత్రాత్మకమైన రామసేతు మార్గంలో ఆ కపుల్ స్విమ్మింగ్ చేసింది. పాల్క్ జలసంధి సుమారు 32 కిలోమీటర్ల దూరం ఉంటుంది. శ్రీలంకలోని తలైమన్నార్‌లో మే 7వ తేదీన ఉదయం 4.30 నిమిషాలకు ఈ జంట స్విమ్మింగ్ స్టార్ట్ చేసింది. తమిళనాడులోని ధనుష్‌కోటికి సాయంత్రం 3.15 నిమిషాలకు చేరుకున్నారు. సుమారు 10 గంటల 45 నిమిషాల పాటు ఆ జంట స్విమ్ చేసింది.ఈతకు చెందిన కొన్ని వీడియోలను రిలీజ్ చేశారు. సముద్ర జలాలు ఎగిసిపడుతున్నా.. ఆ ఇద్దరూ ధైర్యంగా స్విమ్మింగ్ కొనసాగించారు. సూర్యోదయానికి ముందే ఆ కపుల్ సముద్రంలోకి దూకిన విజువల్స్‌ను రిలీజ్ చేశారు. సేఫ్టీ చర్యలు తీసుకుని ఈ స్టంట్ చేపట్టారు. సపోర్టు బోట్లు, పారామెడిక్స్, భారత కోస్టు గార్డు సిబ్బంది ఆ స్విమ్మర్లతోనే ఉన్నారు. ఆ జంట ప్రదర్శించిన సాహసం, తెగువ, ధైర్యం, క్రమశిక్షణను అందరూ మెచ్చుకున్నారు. సోషల్ మీడియాలో వారిపై ప్రశంసలు కురుస్తున్నాయి. భార్యాభర్తలు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ కావడం మరో విశేషం. అయితే ఆ ఇద్దరూ నాలుగేళ్ల క్రితమే స్విమ్మింగ్ శిక్షణ తీసుకున్నారు.

# అమృతకాలం విషకాలంగా మారింది..

-నీట్ పరీక్ష రద్దుపై రాహుల్‌గాంధీ ఫైర్..!



**న్యూఢీల్లి-12మే (మహాప్రభ ).**
కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష ను రద్దు చేయడంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు పడిన కష్టం, వారు కన్న కలలు బీజేపీ సారథ్యంలోని అవినీతి వ్యవస్థవల్ల ఛిన్నాభిన్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ తన అధికారిక 'ఎక్స్ (X)' ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. తన ఎక్స్ ఖాతాలో రాహుల్‌గాంధీ ఏమని రాసుకొచ్చారంటే..!నీట్ పరీక్ష రద్దయ్యింది. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికిపైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఛిన్నాభిన్నమయ్యాయి. పిల్లల చదువు కోసం కొందరి తల్లిదండ్రులు రుణాలు తీసుకున్నారు. కొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం ఎన్నో రాత్రులు మేల్కొని ఉండి చదివారు. అందుకు వారికి దక్కిన ప్రతిఫలం ఏమిటంటే.. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి. ఇది కేవలం వైఫల్యం కాదు. దేశ యువత భవిష్యత్తుపై జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్షల్లేకుండా తప్పించుకు తిరుగుతుంటే.. నిజాయతీపరులైన విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారు' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఇప్పుడు అదే లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఒకరి తలరాతను వారి శ్రమతో కాకుండా డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక విద్యకు నిజమైన అర్థం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'అమృత్ కాలం' ఇప్పుడు 'విష కాలం' గా మారిందని ఎద్దేవా చేశారు. నీట్–యూజీ పేపర్ లీక్ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో ఈ నెల 3న జరిగిన పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఈ రద్దుపై పలు పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

# ముళ్ల తీగలు మమ్మల్ని భయపెట్టలేవ్..

బెంగాల్ సరిహద్దుల్లో ఫెన్సింగ్‌పై బంగ్లాదేశ్..!




**న్యూఢీల్లి-12మే (మహాప్రభ ).**
: పశ్చిమబెంగాల్ -- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్ కు భూమిని కేటాయిస్తూ పశ్చిమబెంగాల్‌లోని నూతన ప్రభుత్వం ఇటీవలే కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై తాజాగా బంగ్లాదేశ్ స్పందించింది. ముళ్ల తీగలకు ఢాకా భయపడదని ఆ దేశ విదేశాంగశాఖ సలహాదారు ఎంహెచ్ కబీర్ వ్యాఖ్యానించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన మీడియా సమావేశంలో చెప్పారు.అవసరమైనప్పుడు భారత్‌తో చర్చలు జరుపుతామని కబీర్ అన్నారు. బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాలను తాము గమనిస్తున్నామని అన్నారు. భారత అంతర్గత రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని చెప్పారు. తమ సంబంధాలు ప్రధానంగా భారత ప్రభుత్వంతోనే ఉంటాయన్నారు. ప్రస్తుతం సవాళ్లు ఉన్నప్పటికీ.. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు రెండు దేశాల నాయకత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇదిలావుంటే అధికారంలోకి వచ్చిన తర్వాత 45 రోజుల్లోనే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణం చేపడతామని బీజేపీ బలంగా ప్రచారం చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలో జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే 45 రోజుల్లో ఆ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

# సీఎం విజయ్ సంచలన నిర్ణయం..

స్కూల్స్, దేవాలయాల దగ్గర మద్యం షాపులకు గుడ్‌బై!




**న్యూఢీల్లి-12మే (మహాప్రభ ).**
నటుడు, తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ తనదైన శైలిలో పాలన కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన ఆయన.. మహిళల భద్రత కోసం ప్రత్యేక రక్షణ దళం ఏర్పాటు, డ్రగ్స్ రహిత సమాజం కోసం కఠిన చర్యలు వంటి కీలక నిర్ణయాలతో ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఇప్పుడు మరోసారి ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, బస్టాండ్లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రజారోగ్యం, సామాజిక భద్రత, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం.. విద్యాసంస్థలు, ప్రార్థనా స్థలాలు, బస్టాండ్లకు కనీసం 500 మీటర్ల దూరంలోనే మద్యం దుకాణాలు ఉండాలి. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్న అన్ని షాపులను వెంటనే మూసివేయాలని లేదా ఇతర ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ నిర్వహించిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 717 మద్యం విక్రయ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. వీటిలో చాలా దుకాణాలు స్కూల్స్, కాలేజీలు, దేవాలయాలు, బస్టాండ్లకు అత్యంత సమీపంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఈ దుకాణాల తొలగింపు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది.విద్యాసంస్థల సమీపంలో మద్యం షాపులు ఉండటం వల్ల విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే బస్టాండ్ల వద్ద మద్యం దుకాణాల కారణంగా మహిళా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో మద్యం మత్తులో కొందరు చేసే ఆగడాలను అరికట్టేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. "ఆదాయం కంటే ప్రజల భద్రత, భవిష్యత్తుకే ప్రాధాన్యం ఇచ్చే నాయకుడు దొరికాడు" అంటూ పలువురు విజయ్ నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు.

# దేశంలో చమురు సరఫరాలో సమస్య లేదు..

-69 రోజులకు సరిపడా క్రూడాయిల్: హర్దీప్ సింగ్ పూరి



**న్యూఢీల్లి-12మే (మహాప్రభ ).**
దేశంలో చమురు సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్ర చమురు సరఫరా మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. చమురు సరఫరాలో ఇబ్బందులేమీ లేవని ప్రకటించారు. దేశంలో తగినన్ని చమురు నిల్వలున్నాయని వెల్లడించారు. దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ వినియోగంలో బాధ్యతగా ప్రవర్తించాలని, వీలైనంత తక్కువగా వాడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.దీంతో దేశంలో చమురు సరఫరాపై చర్చ మొదలైంది. మోదీ సూచనపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో హర్దీప్ సింగ్ పూరి పాల్గొన్నారు. చమురు సరఫరాలో సమస్య లేదన్నారు. "దేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడి క్రూడాయిల్, ఎల్ఎన్‌జీ నిల్వలున్నాయి. 45 రోజులకు సరిపడా ఎల్పీజీ స్టాక్ ఉంది. ఎల్పీజీ ఉత్పత్తిని దేశంలో గణనీయంగా పెంచాం. రోజుకు 35,000 టన్నుల నుంచి 50,000 టన్నుల వరకు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాం. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని సమర్థవంతంగా, బాధ్యతగా ఎదుర్కొన్నాం. ఎక్కడా చమరు సరఫరాలో సమస్య తలెత్తలేదు. ప్రధాని మోదీ ఇచ్చిన సలహా ప్రజల్ని అప్రమత్తం చేయడానికే. దేశంపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకే ఆయన ఈ మాటలు చెప్పారు" అని హర్దీప్ సింగ్ పూరి అన్నారు. ఇటీవల మోదీ మాట్లాడుతూ చమురు వినియోగం తగ్గించాలని, విదేశీ టూర్లు, బంగారం కొనుగోళ్లు వాయిదా వేసుకోవాలని సూచించిన సంగతి తెలిసిందే. అలాగే, పర్యాటకులు ఎక్కువగా దేశంలోనే పర్యటించాలని, దేశీయ ఉత్పత్తులే కొనాలని కూడా ప్రజలకు సూచించారు.

### 15 నుంచి మోదీ..
# విదేశీ పర్యటన

మొదటి తరువాయి

స్వీడన్, నార్వేల మీదుగా సాగి లిమే 20వ తేదీన ఇటలీలిలో ముగియనుంది.
ముందస్తు ప్రణాళికలు:
మొదట యూఏఈ: ఈ నెల 15వ తేదీన యూఏఈ అధ్యక్షుడిని కలిసి ఇంధన సహకారం, వాణిజ్యం, భారతీయ సమాజ సంక్షేమంపై చర్చించనున్నారు.
ఆ తర్వాత స్వీడన్: మే 17న స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో పర్యటించి గ్రీన్ ట్రాన్సిషన్, స్పేస్, రక్షణ రంగాల్లో చర్చలు జరుపుతారు.
నెదర్లాండ్స్‌లో టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్: మే 17 వరకు అక్కడే ఉండి రక్షణ, గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు మరియు నీటి నిర్వహణపై కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షిస్తారు.
నార్వేలో ఇండియా–నార్డిక్ సమ్మిట్: 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. మే 18న నార్వే రాజుతో పాటు ప్రధానితో దౌత్యపరమైన చర్చలు జరిపి, 3వ భారత్–నార్డిక్ సమ్మిట్‌లో పాల్గొంటారు.
చివరి దశలో ఇటలీ పర్యటన: మే 20న ఇటలీ చేరుకుని ప్రధాని జార్జియా మెలోనీతో కలిసి 'జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025–2029' అమలుపై సమీక్ష నిర్వహిస్తారు.
మొత్తానికి ఐరోపా దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో, ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణం

మొదటి తరువాయి

చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. సీఎంగా హిమంత బిశ్వ శర్మతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు.
అసోం సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు హాజరయ్యారు. వీరితో పాటు అస్సాంలోని వైష్ణవ మఠాలకు చెందిన 15 మంది సత్రాధికారులు వంటి ప్రముఖ మత పెద్దలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.
బీజేపీ రాజకీయ ఆధిపత్యం సుస్థిరం
ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎన్డీయే బృందానికి 102 సీట్లు వచ్చాయి. అసోం అసెంబ్లీలో 126 మంది సభ్యులు ఉండగా, దాంట్లో బీజేపీ 82 స్థానాలను చేజిక్కించుకున్నది. ఏజీపీ, యూపీపీఎల్ పార్టీలు చేరి పది సీట్లు గెలుచుకున్నాయి. దీంతో హిమంత బిశ్వ శర్మ రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఆయన తొలిసారిగా 2021లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ ఈశాన్య రాష్ట్రమైన అసోంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందు బీజేపీ, ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా హిమంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### పాస్‌పోర్ట్ సూచీలో
# దిగజారిన భారత్

మొదటి తరువాయి

దక్షిణ కొరియా, జపాన్ ఉన్నాయి.
**2006లో 71వ ర్యాంకు**
భారత పాస్‌పోర్టు 2006లో 71వ ర్యాంకుతో తన అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఇప్పుడు ఇది బుర్కినా ఫాసో, క్యూబా, సెనెగల్‌తో కలిసి 78వ స్థానాన్ని పంచుకుంటున్నది. హెన్లీ పాస్‌పోర్టు సూచీ ప్రపంచవ్యాప్తంగా 199 దేశాలను మూల్యాంకనం చేస్తుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత పాస్‌పోర్టు బలహీనపడి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# బేటా భగావో .. బేటా బచావో

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేటీ బచావో – బేటీ పడావో అనేది ఒరిజినల్ స్లోగన్ అయినప్పటికీ ఇప్పుడు కొత్త నినాదం తెరమీదకు వచ్చిందని తెలిపారు. బేటా భగావో – బేటా బచావో అనే నినాదాన్ని బీజేపీ, కాంగ్రెస్ పాటిస్తున్నాయని మండిపడ్డారు. వెల్ డన్ కాంగ్రెస్ అండ్ బీజేపీ అని వ్యాఖ్యానించారు.
అంతకుముందు ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితునిగా ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను పోలీసులు అరెస్టు చేయకపోవడంపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ రితిరాజ్ గైక్వాడ్ మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు ఆయన కాల్ డేటాను సేకరిస్తున్నారని, దొరకగానే పట్టుకుంటామని తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర హోంమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడా? దేశ చరిత్రలో ఇదే మొదటి సారా?' అని ప్రశ్నించారు.

# అమృత్ కాలం కాదు.. విష యుగం!

మొదటి తరువాయి

ఉద్యమించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ఆర్జేడీ డిమాండ్ చేసింది. పేపర్ లీకేజీలతో పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వసనీయత దెబ్బతింటున్నదని సీపీ ఎం ఆందోళన వ్యక్తం చేసింది.

# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

మొదటి తరువాయి

నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీలు ఏపీకి, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 5 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతిచ్చింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలిపిన తెలంగాణ, సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని వాదించింది. తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్టు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దాంతో రెండు రాష్ట్రాలు బోర్డు నిర్ణయాన్ని అంగీకరించారు. కాగా తమకు 18 టీఎంసీలు కావాలని తెలంగాణ అభ్యర్థించగా, మరో మూడు టీఎసీలు అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ ఒప్పందం ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందని కేఆర్ఎంబీ వర్గాలు తెలిపారు. ఈ నెల 14న కేఆర్ఎంబీ 21వ సమావేశం జరగనుంది. కృష్ణానది నీటి వాటాలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీలకు చెందిన ఈఎన్సీలు రమేశ్‌బాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# ప్రతి గింజా కొనాల్సిందే

మొదటి తరువాయి



పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచి కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు కూడా వెనకాడొద్దన్నారు.
ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరానిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ
అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి ఐకేపీవీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తూకం, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అద్దంకి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, శాంతికుమారిలు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దు !

మొదటి తరువాయి

రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేసింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాతీయ పరీక్షా వ్యవస్థ పారదర్శకతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.
లోతుగా దర్యాప్తు
కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రాథమిక సమాచారం మేరకు నీట్ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఎన్టీఏ కఠిన నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్‌లో పరీక్షకు ముందే పేపర్ ఎలా సర్క్యులేట్ అయింది? దీనివెనుక ఏమైనా మూలాలు ఉన్నాయా? అన్నకోణంలో లోతుగా దర్యాప్తు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. విచారణకు అవసరమైన అన్ని రికార్డులను సీబీఐకి అందజేస్తామని ఎన్టీఏ పేర్కొంది. మే మూడున నీట్ యూజీ 2026 పరీక్ష కెమిస్ట్రీలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును రాజస్థాన్ పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్, ఎస్ఓజీ అధికారులు స్వయంగా వెల్లడించారు. పరీక్షకు 42 గంటల ముందు ఆ పేపర్ రాజస్థాన్‌లోని సికార్‌లో వాట్సాప్ నుంచి వచ్చినట్లు గుర్తించారు.
కేరళ ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా..
నీట్ ప్రశ్నపత్రంలో 600 మార్కుల ప్రశ్నలతో ఆ పేపర్ పోలి ఉంది. కొన్ని ప్రశ్నలు ఒకేలా ఉండటం పలు అనుమానాలు మొదలయ్యాయి. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. సదరు వ్యక్తి ఈనెల ఒకటిన సికార్‌లోని తన ఫ్రెండ్‌కి దానికి సంబంధించిన మెటీరియల్ ఇచ్చాడని తెలుస్తోంది. ఆ పేపర్ కాస్తా కోచింగ్ నెట్‌వర్కులు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరింది. అందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించి 300లకు ప్రశ్నలు చేతి రాతతో ఉన్నట్లు తెలిసింది. ఆ పేపర్ ఇచ్చినందుకు విద్యార్థుల నుంచి రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు పోలీసులు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ

మొదటి తరువాయి

నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బీహెచ్ కే ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనలో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్ భూములు, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్ల శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

# మధ్యవర్తిగా పాక్‌ని నమ్మలేం

మొదటి తరువాయి



ట్రంప్ కు సన్నిహితులైన కొందరు ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారంటూ మరొక అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. శాంతి చర్చల స్థితిపై దేశాధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఇరాన్ ను పాకిస్థాన్ తెలియాజేస్తోందా లేదా అనే దానిపై ఇప్పుడు అమెరికా ప్రభుత్వ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపింది.
ఇరాన్ తరపున సానుకూలంగా పాక్ ప్రజెంటేషన్
ఇరాన్ వైఖరి గురించి అమెరికాకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పకుండా, దాన్ని పూర్తి సానుకూల కోణంలో పాకిస్థాన్ ప్రజెంట్ చేస్తోందనే భావనకు ట్రంప్ సర్కారులోని కొందరు అధికారులు వచ్చారని కథనం పేర్కొంది. పాక్ ఈ విధంగా చేస్తున్నందు వల్లే శాంతి చర్చలపై అమెరికా అధికారులు చేస్తున్న ప్రకటనలకు, ఇరాన్ పక్షం తీసుకుంటున్న వైఖరులకు మధ్య తేడాలు ఉంటున్నాయని చెప్పింది. తమ ఎదుట కూడా చైనానే అడ్డున్నట్లు సోమవారం రోజు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషియాన్ చేసిన ప్రకటన సైతం ఇందుకు సాక్ష్యంగా నిలిచింది. తమ దేశ సైనిక శక్తికి, జాతీయ ప్రయోజనాలకు మద్దతుగా ఉండే చర్యలకే ప్రాధాన్యత ఇస్తామని ఆయన తేల్చి చెప్పడం గమనార్హం. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ, అమెరికా – ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పుడు వెండిలేటర్ పై ఉందని ప్రకటించారు. ఇరాన్ గతంలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉందని, ఆ దేశ ప్రతిపాదన చెత్త ముక్కతో సమానమని అది అమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ పంపిన చెత్తను పూర్తిగా చదవలేదని, మొత్తం మీద వాళ్లు (ఇరాన్) వెండిలేటర్ పై ఉన్నారని ట్రంప్ హెచ్చరించారు. కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ నిర్మించుకున్న కొద్దిపాటి బలన్నైనా అమెరికా ఒక్క రోజులోనే నాశనం చేస్తుందన్నారు.
ఇరాన్ పై మళ్ళీ దాడులకే ట్రంప్ మొగ్గు?
చర్చల వేళ ఇరాన్ ప్రదర్శించిన మొండి వైఖరిపై ప్రెసిడెంట్ ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారంటూ ఓ అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఇరాన్ పై వైమానిక దాడులను ప్రారంభించే ప్రతిపాదనను ఆయన పరిశీలించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని ఇరానే నియంత్రిస్తుండటం పైనా ట్రంప్ అసహనంతో ఉన్నారని పేర్కొంది. ఇరాన్ లోని అతివాద నేతలే శాంతి చర్చలకు అడ్డు తగులుతున్నారనే అభిప్రాయాన్ని అమెరికా ప్రెసిడెంట్ పునరుద్ఘాటించారని కథనంలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఇరాన్ వ్యక్తం చేస్తున్న వైఖరిని బట్టి, ఆ దేశానికి చర్చలపై అసలు ఆసక్తి ఉందా అనే ప్రశ్న అమెరికా ప్రభుత్వ వర్గాల్లో ఉదయిస్తోందని తెలిపారు.
ట్రంప్ సర్కారులోనూ విభేదాలు:
అమెరికన్ మీడియా కథనం ప్రకారం, తదుపరి కార్యాచరణ విషయంలో ట్రంప్ సర్కారులోనూ విభేదాలు తలెత్తాయి. తీవ్రమైన సైనిక చర్య ద్వారా ఇరాన్ ను తొలుత బలహీనపరచాలని రక్షణ శాఖలోని పలువురు అధికారులతో పాటు ఇంకొందరు కీలక నేతలు ట్రంప్ కు సూచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్ తో చర్చలను ఇంకొంత కాలం పాటు కొనసాగించడం మంచిదని ఇంకొందరు ముఖ్య నేతలు ట్రంప్ కు సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. చాలా దశాబ్దాలుగా ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొని నిలబడిన ఇరాన్, అమెరికా సర్కారు ఆలోచించినంత అత్యవసరంగా పరిష్కారాన్ని కోరుకునే అవకాశాలు ఉండవని ట్రంప్ సర్కారులోని ఇంకొందరు నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

# సంపాదకీయం

## దెబ్బమీద దెబ్బ




ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న వేళ.. ఎరువుల కంపెనీలు అదను చూసి రైతులను దెబ్బకొట్టాయి. అమెరికా– ఇరాన్ యుద్ధం వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయంటూ దేశంలోని ఎరువుల కంపెనీలు ధరలను భారీగా పెంచేశాయి. ఈ ధరలు తక్షణం అమల్లోకొస్తాయని తెలిపాయి. అంతర్జాతీయంగా గ్యాస్, చమురు, ముడి సరుకుల ధరల పెరుగుదల, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను సాకుగా చూపి సబ్సిడీ పెంచాలని కంపెనీలు కేంద్రాన్ని కోరాయి. కానీ, సబ్సిడీ పెంపునకు అంగీకరించకుండా కంపెనీలే ధరలు పెంచుకోవడానికి మోడీ సర్కార్ అనుమతినిచ్చింది. అంతర్జాతీయంగా ఇలాంటి విపత్తులు ఎదురైనప్పుడు కేంద్రమే ఆ భారాన్ని భరించి రైతులపై పడకుండా చూడాలి. కానీ, కంపెనీలకే ఆ అధికారాన్ని అప్పగించడం ద్వారా ఈ ప్రభుత్వం రైతులపక్ష?ం కాదు, కార్పొరేట్ పక్ష?మేనని మరోసారి రుజువైంది. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువుల ధర యాభై కిలోల బస్తాపై రూ.225 నుంచి 300 వరకు, ఎంఓపీ (పొటాషియం) రేటు బస్తాకు రూ.125 పెరిగింది. ఇలాంటి ప్రభావం ఉన్నప్పుడు ఉత్పత్తి ఖర్చులు పెరిగితే కేంద్రం సబ్సిడీ ఇవ్వాలి. అంతేగాని ధరలు పెంచు కోవడానికి అనుమతి ఇవ్వడమేంటని రైతుసంఘాలు, మేధావుల ప్రశ్న. ప్రపంచ దేశాల్లో రైతు లను, వ్యవసాయాన్ని ఆదుకోవా లంటున్న ఆయా ప్రభుత్వాలు.. మన దేశంలో పాలకులు రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ వారిని సాగుకు దూరం చేస్తున్నాయి. ఇప్పటికే ధర బాగున్నా చీడపీడలతో మిరప దిగుబడులు పతనమయ్యాయి. ఎక్కువ మొత్తంలో మక్కలు దిగుబడులొచ్చినా ధర లేదు. వానాకాలంలో పత్తి, పెసర పంటలు అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. వరి పంట పరిస్థితి అప్పుడు ఇప్పుడూ అదే పరిస్థితి. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. పంటను అమ్ముకోలేకఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. కుప్పల మీదే ప్రాణాలు విడుస్తున్నారు. ఈ సమయంలో రైతులకు భరోసా కల్పించాల్సిన కేంద్రం ఎరువుల ధరలు పెంచడానికి అనుమతినివ్వడం బాధ్యత నుంచి తప్పుకోవడమే అవుతుంది. వ్యవసాయ రంగంలో విత్తనం తర్వాత అత్యంత కీలకమైనది ఎరువు. ముఖ్యంగా యూరియా, డీఏపీ, పొటాష్, ఎన్పీకే వంటి ఎరువులు లేకుండా సాగు అసాధ్యం. కానీ ఈ ఎరువుల ధరలు ప్రతి ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు పెరిగాయని, దిగుమతి ఖర్చులు అధికమ య్యాయని, ఉత్పత్తి వ్యయం పెరిగిందని కంపెనీలు చెబుతుంటాయి. పైకి కంపెనీలు చెప్పినట్టు కనిపిస్తున్నా.. ప్రభుత్వమే వారి చేత ఈ మాటలు చెప్పిస్తున్నదన్న విమర్శల్ని కొట్టిపారేయలేం. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారాలను తమ మీద వేసుకోవడానికి సిద్ధపడటం లేదు. గ్యాస్ ధరలు పెంచినప్పుడే ఒక్కొక్క దానిపై కేంద్రం భారాలు వేయడానికి సిద్ధమైంది. కాకపోతే రైతుల వ్యతిరేకత తమ వైపునకు రాకుండా జాగ్రత్తలు పడినట్టు అర్థమవుతోంది. యూరియా, డీఏపీలను మినహాయించి మిగతా కాంప్లెక్స్ ధరలు పెంచుకునేందుకు అంగీకారం తెలిపినా, వాటి ధరలు కూడా త్వరలో పెరగడం ఖాయం! ప్రభుత్వాలు రైతును దేశానికి అన్నదాత అని కొనియాడుతుంటాయి. ఎన్నికల సమయంలో రైతు సంక్షేమం గురించి పెద్ద పెద్ద హామీలిస్తాయి. కానీ వాస్తవ పరిస్థితుల్లో రైతుకు అత్యవసరమైన సబ్సిడీలు ఇవ్వడానికి సంకోచిస్తున్నాయి. కంపెనీల లాభాల కోసం రైతు ప్రయోజనాలను పక్కనపెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ ఇస్తున్నామని చెప్తున్నా అదంతా ఒక బూటకం. సబ్సిడీ ఎక్కువగా ఎవరికి అందుతున్నదో అందరికీ తెలిసిన విషయమే. సాగు ఖర్చులు మరింత పెరిగితే రైతులు వ్యవసాయం వదిలేయడమేనా? రైతు బలహీనపడితే దేశం బలహీనపడినట్టే అనే విషయాన్ని పాలకులు ఎందుకు గుర్తించడం లేదు? వ్యవసాయరంగం ఇప్పటికే అనేక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితులతో కుదేలవుతున్నది. అస్థిర మార్కెట్, పంటలు సరైన దిగుబడులు రాకపోవడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడం, పెరుగుతున్న సాగు వ్యయం, అప్పులభారం వంటి సమస్యలతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇలాంటి సమయంలో 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు' ఎరువుల ధరలు పెంచుకునేందుకు కంపెనీలకు కేంద్రం అనుమతినివ్వడం అన్యాయం. ఇది భవిష్యత్తులో వ్యవసాయరంగానికి పెద్ద ప్రమాదంగా పరిణమించనుంది. ఎందుకంటే, వ్యవసాయానికి ప్రాణాధారమైన ఎరువుల ధరలు పెంపుదల కేవలం రైతుపైనే కాదు, దేశ ఆహార భద్రతపై కూడా తీవ్రమైన ప్రభావం చూపే నిర్ణయం. ఇప్పటికైనా కంపెనీల లాభాల కంటే రైతు ప్రయోజనాలను కాపాడే విధంగా కేంద్రసర్కార్ వ్యవహరించాలి. లేదంటే రైతుక్ష?త్రంలో దోషిగా నిలబడక తప్పదు. ?

# ప్రశాంతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -12మే (మహాప్రభ ).** ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో పాటు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..సమాజంలో సౌభ్రాతృత్వం, ప్రేమ, పరస్పర గౌరవం పెంపొందించే ఈ పవిత్ర పండుగను అందరూ ఐకమత్యంతో నిర్వహించాలని సూచించారు. బక్రీద్ పండుగ త్యాగానికి, సేవాభావానికి ప్రతీక అని పేర్కొంటూ, పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..బక్రీద్ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు ప్రజలు ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతుందని వెల్లడించారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించి పండుగను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,ఆర్డీఓ రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి వెంకట స్వామి, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, డి ఎస్ పి లు ,సి ఐ లు తదితరులు పాల్గొన్నారు.

### మోత్య తండలో వైభవంగా వినోద్

# దివ్యల వివాహ రిసెప్షన్

**-ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన జాలే నరసింహారెడ్డి**



**దేవరకొండ ( డివిజన్) 12మే మహాప్రభ:** నల్గొండ జిల్లా, దేవరకొండ నియోజకవర్గం, చందంపేట మండల పరిధిలోని మోత్య తండ గ్రామంలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ నేనావత్ భరత్ కుమార్ నాయక్ సోదరుడు, నూతన వరుడు నేనావత్ వినోద్ – దివ్యల వివాహ రిసెప్షన్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ముఖ్య అతిథులుగా జాలే నరసింహ రెడ్డి, జ౦= చీజుబొ రామావత్ రాంబాబు నాయక్, మహా మహా లక్ష్మయ్య, చందు నాయక్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకకు విచ్చేసిన అతిథులను సర్పంచ్ భరత్ కుమార్ నాయక్ కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందు భోజనంలో బంధుమిత్రులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంజారా సంప్రదాయ నృత్యాలు, సంగీతం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నూతన దంపతులు జీవితాంతం సుఖసంతోషాలతో, అన్యోన్యంగా ఉండాలని హాజరైన ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా దీవించారు. గ్రామంలో జరిగిన ఈ వివాహ రిసెప్షన్ వేడుక స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ఎంకేఆర్ కళాశాల వసతులు భేష్..

**-ప్రిన్సిపాల్, సిబ్బంది పనితీరు అమోఘం**
**- దేవరకొండ డివిజన్ ఎంఈఓల ప్రశంస**




**దేవరకొండ ( డివిజన్) 12మే మహాప్రభ:** స్థానిక మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ దేవరకొండలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా దేవరకొండ డివిజన్ పరిధిలోని ఎంఈఓ ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా వారు కళాశాల వసతులు, వనరులు, వాతావరణం, అడ్మినిస్ట్రేషన్ ,అడ్మిషన్స్ తదితర అంశాలను పరిశీలించి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మరియు కళాశాల సిబ్బంది పనితీరును కొనియాడారు. అనంతరం కళాశాల ఎన్రోల్మెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా దేవరకొండ డివిజన్ లోని ఎంఈఓ లు మా కళాశాలను సందర్శించి మా కళాశాల యొక్క వనరులు వసతులు అభివృద్ధిని కొనియాడడం మాకు చాలా ఆనందకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి ఎంఈఓ ఆర్. నాగేశ్వరరావు, చింతపల్లి ఎంఈఓ ఎన్.అంజయ్య, దేవరకొండ ఎంఈఓ ఏ. మాతృనాయక్, నేరేడుగొమ్ము ఎంఈఓ టి.బ్రహ్మాచారి, డిండి ఎంఈఓ పి.నరసింహ, పీఏ పల్లి ఎంఈఓ ఏ.వెంకటయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### బస్సు సౌకర్యం కల్పించాలని

## డిపో మేనేజర్ కి గ్రామస్తులు వినతి పత్రం



**గాంధారి, మే11 (మహాప్రభ)** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పతకంలో భాగంగా గాంధారి మండలం పోతంగల్ కుర్దు గ్రామస్తుల అభ్యర్థన మేరకు రెండు ట్రిప్పులు బస్సు సౌకర్యం కల్పించాలని కామారెడ్డి డిపో మేనేజర్, గ్రామప్రజలు వినతి పత్రం అందజేశారు. దీనికి కామారెడ్డి బస్సు డిపో మేనేజర్ సానుకూలంగా సంప్రదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ శేఖర్, గ్రామకమిటీ పాలక వర్గం కాశిరెడ్డి, గంగారెడ్డి, సాయిలు, దిలీప్, సురేష్, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

# గాగిళ్ళాపురం లో ఆధ్యాత్మిక చైతన్యం

**- వైభవంగా మూడోసారి బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం**




**దేవరకొండ ( డివిజన్) 12మే మహాప్రభ** నల్గొండ జిల్లా చందంపేట మండలం గాగిళ్ళాపురం గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్ మాసారం ఆనంద్ పిలుపు మేరకు గ్రామ ప్రజలందరూ ఏకమై ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా క్రైస్తవ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ ఉద్యమ నేత డాక్టర్ మాసారం ప్రేమ్ కుమార్ హాజరయ్యారు. ఆయన బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు విజయ్, రాజ్, డేవిడ్ మరియు బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు గుండాల వెంకట్ యాదవ్, ఎస్కే నిరంజన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.గ్రామ సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విశ్వాసాలను కాపాడుకోవడంలో గాగిళ్ళాపురం గ్రామస్తులు చూపుతున్న చొరవను నాయకులు కొనియాడారు.బొడ్రాయి వంటి కార్యక్రమాలు గ్రామంలోని ఐక్యతను మరియు సంస్కృతిని ప్రతిబింబిస్తాయని వక్తలు పేర్కొన్నారు.మంగళ వాయిద్యాలు, ప్రత్యేక అలంకరణలతో గ్రామ వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ భారీ స్థాయిలో ప్రసాద వితరణ జరిగింది. ఈ మహోత్సవంతో గాగిలాపురంలో పండుగ వాతావరణం నెలకొంది. తమ గ్రామానికి శుభం కలగాలని కోరుకుంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

### జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు ముక్కర్ల

## బిక్షపతి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు.



**మోత్కూర్ 12 మే (మహాప్రభ)** ఈరోజు వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు ముక్కర్ల బిక్షపతి అన్న మరియు అక్క పలువురు ప్రముఖులు, రాయారపు మహేశ్ గడ్డి అన్నారం డివిజన్ సరూర్ నగర్ స్నేహితులు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిక్షపతి దంపతులు ఇలాగే ప్రేమాభిమానాలతో, ఆనందోత్సాహాలతో నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ముందుండే బిక్షపతి మరిన్ని విజయాలు సాధించాలని, వారి కుటుంబం ఎల్లప్పుడూ సంతోషాలతో కళకళలాడాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి..

-బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

-మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బిఆర్ఎస్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు.



**మెదక్ జిల్లా -12 మే (మహాప్రభ )**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బిఆర్ఎస్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కేసు దర్యాప్తులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. చట్టం అధికార పార్టీకోలా, సామాన్య ప్రజలకోలా వేర్వేరుగా అమలవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బిఆర్ఎస్ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేసే పోలీసులు, ఈ ఘటనలో మాత్రం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. దేశంలో మహిళల రక్షణ, బాలికల భద్రత గురించి పెద్ద ఎత్తున మాట్లాడే నాయకుల కుటుంబ సభ్యులే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడం దురదృష్టకరమని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, సామాన్యుడైనా – – కేంద్ర మంత్రిపుత్రుడైనా ఒకే విధమైన న్యాయం జరగాలని స్పష్టం చేశారు. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కాపాడేందుకు రాజకీయ ప్రభావం ఉపయోగించకూడదని హెచ్చరించారు. బండి సంజయ్ కుమార్ తన కుమారుడిని రక్షించేందుకు అధికార ప్రభావాన్ని వినియోగిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసు దర్యాప్తును బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో పట్టణ పార్టీ కో కన్వీనర్లు గడ్డమీద కృష్ణగౌడ్, లింగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఆర్కే. శ్రీనివాస్, నాయకులు ప్రభు రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



**శేరిలింగంపల్లి, మే 12 (మహాప్రభ )**
హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ శనార్నె శ్రీనివాస రావు నిర్వహించారు. ఈ పరిశీలనలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించేందుకు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. అలాగే కాలనీలో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను కూడా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. డివిజన్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులు మరియు తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రత్యేక చొరవతో పరిశీలించి, అత్యవసర అవసరాలున్న ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఏ సమస్య తన దృష్టికి వచ్చినా తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, సమస్యల రహిత ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని నార్నె శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తానని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. హైదర్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన అగ్రగామి డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ డీఈ మౌనిక, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, శానిటేషన్ డీఈ శంకర్ గణేష్, ఏఈ బన్సిపటేల్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక బద్ధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కలెక్టర్

-కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిని మిల్లులకు తరలించాలి..

-ధాన్యాన్ని విల్లులకు తలించేందకు ప్రత్యేక చర్యలు.



**మెదక్ జిల్లా -12మే (మహాప్రభ )**
ఇప్పటి వరకూ 21, 208 రైతుల నుంచి 1,00,534 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 9710 మంది రైతులకు 111.90.కోట్ల రూపాయలు చెల్లింపులు జరిగాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కొనుగోలు అయిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబందిత అధికారులను మంగళవారం ఒక ప్రకటన ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 21, 208 రైతుల నుంచి 1,00,534 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 9710 మంది రైతులకు 111.90.కోట్ల రూపాయలు చెల్లింపులు జరిగాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలు లేకుండా వెను వెంటనే విల్లులకు తలించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వేగవంతంగా రవాణా చేయుటకు దిశనిర్దేశం చేశారు. కొనుగోలు అయిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించుటకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లారీ ల పైనే ఆధార పడకుండా అవసరమైతే ఇతరాత్ర వాహనాలను ద్వారా మిల్లులకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రోజువారిగా కేంద్రాలో గల నిల్వలు, మిల్లులకు తరలించిన వివరాల నివేదికలను సమర్పించాలని కలెక్టర్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించుటలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని నిర్వహకులకు కలెక్టర్ స్పష్టం చేశారు. గన్ని సంచులు, టార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, కేంద్రాలలో ఉండే ప్రతి దాన్యం గింజను మిల్లులకు తరలించే వరకు శ్రమించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తెవాలన్నారు. అలాగే ధాన్యాన్ని కొనుగోలు చేసిన వివరాలు , మిల్లులకు రవాణా చేస్తున్న ధాన్యం వివరాలను సంబంధిత రిజిష్టర్లలో పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ధర్నా..

-బిఆర్ఎస్ నాయకుల మద్దతు





**శివంపేట మే 12 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని చిన్న గొట్టిముక్కల చౌరస్తాలో రైతులు ఆందోళనకు దిగారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు బిఆర్ఎస్ పార్టీ శివంపేట మండల అధ్యక్షుడు రమణ గౌడ్ తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మద్దతుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రమణ గౌడ్ మాట్లాడుతూ రైతులు ఆరు కాలాలు కష్టపడి పండించిన ధాన్యం రోడ్లపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శివంపేట మండలంలోని చేన్నాపూర్, తిమ్మాపూర్, చిన్న గొట్టిముక్కల గ్రామాలకు చెందిన రైతులు గత 20 రోజులుగా ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అధికారులు పట్టించుకునే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ కాలంలో 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగేదని, ప్రస్తుతం మాత్రం రైతులు ధాన్యాన్ని స్వంత ఖర్చులతో రైస్ మిల్లులకు తరలించాల్సి వస్తోందని విమర్శించారు. అక్కడ హమాలీ, ఇతర ఛార్జీలు కూడా రైతులపైనే మోపుతున్నారని ఆరోపించారు. ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్.







**కొత్తపేట 12 మే (మహాప్రభ)**
హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర కాలనీ మరియు మారుతి నగర్‌లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయాలలో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమాలకు కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎల్ బి నగర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరావు గారు, బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ , వెంకట్ రెడ్డి , తిరుమల తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంల ప్రైవేటు పాఠశాలల ప్రచారం

-పట్టించుకోని అధికారులు

-బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ



**దేవరకొండ మే 12 ( మహాప్రభ )**
ఎన్నికల ప్రచారం ల ప్రైవేటు పాఠశాలలు ప్రచారం నిర్వహిస్తున్నారని బిఆర్ఎస్వి నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ......ప్రవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్న నిమ్మకు నీరేత్తినట్లు అధికారులు వ్యవహారిస్తున్నారని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అయన హేచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, కౌన్సిలర్ పొట్ట మధు, జమీర్ బాబా, అభి, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కు పాలాభిషేకం.

-సామాజిక వేత శ్రీనివాస్ గౌడ్



**దేవరకొండ మే 12 ( మహాప్రభ)**
కృతజ్ఞతలు తెలిపిన సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి. శ్రీనివాస్ గౌడ్. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గం లో బిసి గురుకులాలైన బాలుర, బాలిక లలో సీఈసీ గ్రూపును గురుకుల సెక్రెటరీ సైదులు తొలగించి వేరే కళాశాలకు మార్చగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆందోళన చేసి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేయగా విజ్ఞప్తి మేరకు గురుకుల సెక్రటరీ గారితో మాట్లాడి సిఇసి గ్రూపును యధా స్థానంలో తీసుకువచ్చినందుకు దీనితోపాటు జిల్లాలో ఉన్నటువంటి అన్ని బీసీ గురుకులాల్లో తొలగించినటువంటి గ్రూపులన్నింటినీ యదా స్థానంలో తీసుకొచ్చినందుకు ఆర్. కృష్ణయ్య పాలాభిషేకం చేశారు . ఆయనకు దేవరకొండ నియోజకవర్గం, జిల్లా ప్రజల ప్రక్షాళన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ గురుకులాలకు ఆయన చేసిన సేవలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రోత్సహించే విధంగా సహకరించారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చేరుపెల్లి జయలక్ష్మి ,ఎండి రంజాన్ బేగ్, చిలువేరు ముత్తమ్మ, బీమగోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, లైబ్రరీ శారద, శివ తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురంలో ఏపీ వ్యాకస 30వ మహాసభలు

**నందికొట్కూరు,-12మే (మహాప్రభ )**
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 30వ మహాసభలు అమలాపురంలో మే 11, 12, 13 తేదీలలో జరుగుతున్నాయి. నంద్యాల జిల్లా నుండి సంఘం ప్రతినిధులు జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు, కార్యదర్శి నరసింహ నాయక్, మండల నాయకులు ఎం. కరణ, టి. ఓబులేసు, డేవిడ్, రాములమ్మ, మధు శేఖర్, కుళాయి స్వామి, అర్జున్, మద్దమ్మ, ఏసేపు తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యలు, సంక్షేమ చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుగుతున్నాయి.

## మైనంపల్లి గ్రామంలో నర్సుల దినోత్సవం



**దేవరకొండ -12మే (మహాప్రభ )**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ ఆధ్వర్యంలో ప్రపంచ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలో పనిచేస్తున్న నర్సులకు ఏఎన్ఎం లకు ఆశా కార్యకర్తలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాసారం అంబేద్కర్.ఏ ఎన్ ఎం లు విజయ, విద్యావతి, ఆశా కార్యకర్త అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గురుకులాల్లో సీఈసీ గ్రూపు పునరుద్ధరణ

### ఆర్. కృష్ణయ్యకు పాలాభిషేకం



**దేవరకొండ,-12మే (మహాప్రభ )**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో బీసీ గురుకులాల్లో తొలగించిన సీఈసీ గ్రూపును యధాస్థానంలోకి తీసుకువచ్చినందుకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు పాలాభిషేకం చేశారు.గురుకుల సెక్రటరీ సైదులు తొలగించిన గ్రూపులను తిరిగి పునరుద్ధరించేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేయగా, ఆర్. కృష్ణయ్య జోక్యం చేసుకుని అన్ని బీసీ గురుకులాల్లో గ్రూపులను యధాస్థానంలోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, “పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్. కృష్ణయ్య చేసిన సేవలు విశేషం. ఆయనకు కృతజ్ఞతలు” అని పేర్కొన్నారు.కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చేరుపెల్లి జయలక్ష్మి, ఎండి రంజాన్ బేగ్, చిలువేరు ముత్తమ్మ, బీమగోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, లైబ్రరీ శారద, శివ తదితరులు పాల్గొన్నారు.


## ఎన్నికల ప్రచారంల ప్రైవేటు పాఠశాలల ప్రచారం

-నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.
-బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ.



**దేవరకొండ -12మే (మహాప్రభ )**
ఎన్నికల ప్రచారం ల ప్రైవేటు పాఠశాలలు ప్రచారం నిర్వహిస్తున్నారని బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూప్రవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్న నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అయన హేచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, కౌన్సిలర్ పొట్ట మధు, జమీర్ బాబా,అభి,తదితరులు పాల్గొన్నారు.

## నీటి వినియోగం పై అవగాహన సదస్సు



**దేవరకొండ 12మే (మహాప్రభ )**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో జల్ సంచాయి - జన్ భాగీదారి.జల శక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగాగ్రామంలో ప్రజలకు నీటివినియోగం.నీటి సంరక్షణకు చేపట్టవలసిన పనుల గురించి స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు జహీర్ , అమరెందర్ ,వార్డు సభ్యులు కొర్ర లక్ష్మీ ప్రశాంత్, కొర్ర సునీత బద్దు,కొర్ర కిషన్ నాయక్ ,పులిజాల సంతోష వెంకట్ ,పులిజలా నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు

# ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలి

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.






**మెదక్ జిల్లా -12మే (మహాప్రభ )**
జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.
మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో ఆయిల్ ఫామ్ సాగు ప్రగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఆయిల్ ఫామ్ సాగు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు అందించే పంటగా ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, ఎరువులు, సాంకేతిక సూచనలు అందించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం, కొత్తగా నమోదు చేసుకున్న రైతుల వివరాలు, నీటి వనరుల లభ్యత, డ్రిప్ సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ఆయిల్ ఫామ్ పంటపై రైతుల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిబిరాలు, క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. సాగు ప్రారంభించిన రైతులకు సకాలంలో సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తే ఆర్థికంగా మరింత లాభపడతారని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాలపై రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమం



**తూప్రాన్, మే 12. (మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో “అమ్మకు అక్షరమాల” నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమంపై రిసోర్స్ పర్సన్స్‌కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి అధ్యక్షత వహించగా, వయోజన విద్య ఆధ్వర్యంలో మెప్మా జిల్లా అధికారి హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలో నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందని తెలిపారు. వారిని మూడు నెలల పాటు “అమ్మకు అక్షరమాల” ద్వారా చదవడం, రాయడం నేర్పించి నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించడమే “ఉల్లాస్” పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు కనీసం సంతకం చేసే స్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు.
రిసోర్స్ పర్సన్స్ గ్రామాల్లో నిరక్షరాస్యులకు సమర్థవంతంగా బోధన అందించి వారిలో అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ, ఆసియా, ఎస్‌జిహెచ్ మహిళలు, రిసోర్స్ పర్సన్స్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చాకరిమెట్ల లో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు





**శివంపేట, మే 12 (మహాప్రభ):**
శివంపేట మండలం చిన్న గొట్టుముక్కల గ్రామ పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవాలయం లో హనుమాన్ జయంతి వేడుకలను ఆలయ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించి స్వామివారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# సోలార్ వినియోగంపై అవగాహన సదస్సు







**మానకొండూర్, -12మే (మహాప్రభ )**
సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందాలని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలను కోరారు. మంగళవారం పచ్చునూరు గ్రామంలో టీఎస్ఆర్ఈడీసీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల వరకు పొందవచ్చని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇచ్చి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.అదే రోజు పచ్చునూరులో వీవో భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీఎస్ఆర్ఈడీసీఓ అధికారులు, మండల తహసిల్దార్ వివి వరలక్ష్మి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు రొంటాల లక్ష్మారెడ్డి, కనకం అశోక్, రేమిడి శ్రీనివాసరెడ్డి, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, బండి మల్లేష్, రేమిడి తిరుపతి, సాయిరి దేవయ్య, కోంఢ్ర సురేష్, కనకం కుమార్, బుర్ర శ్రీధర్, వేగోళం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.సోలార్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించుకోవాలని, గ్రామాభివృద్ధి కోసం వీవో భవనాలు కీలకమని ఎమ్మెల్యే సత్యనారాయణ స్పష్టం చేశారు.

## జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈవోగా ఆకుల సంజీవరావు నియామకం



**పెద్దపల్లి, -12మే (మహాప్రభ )**
ఓదెల మండలానికి చెందిన ఆకుల సంజీవరావు పెద్దపల్లి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా నియమితులయ్యారు. కరీంనగర్ రూరల్ మండలంలో ఎంపీడీవోగా సేవలందించిన ఆయన పదోన్నతి పొందారు.మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈవోగా ఆకుల సంజీవరావు నియమితులైనందుకు ఓదెల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో సమర్థవంతంగా పనిచేస్తానని ఆకుల సంజీవరావు సంకల్పం వ్యక్తం చేశారు.

# బిజినెస్

## భారత ఆర్థిక వృద్ధికి డబుల్ సెగ

**జిడిపి 6 శాతమే : హెచ్ఎస్‌బిసి అంచనా**

**ముంబయి**




అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, దేశీయంగా వర్షపాత లేమి భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ప్రముఖ అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ హెచ్ఎస్‌బిసి హెచ్చరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026–27నకు సంబంధించి భారత వాస్తవిక జిడిపి రేటు అంచనాను గతంలో ప్రకటించిన 7.4 శాతం నుండి ఏకంగా 6 శాతానికి కోత పెట్టింది. ?ఇది ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలను స్పష్టం చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ గత నెలలో జిడిపి వృద్ధిని 6.9 శాతంగా అంచనా వేయగా.. హెచ్ఎస్‌బి అంతకంటే తక్కువగా ఉంటుందని చెప్పడం ఆందోళకరం. రాబోయే రోజుల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అంతర్జాతీయ చమురు రాజకీయాలు భారత ఆర్థిక భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని ఆ సంస్థ తెలిపింది. హెచ్ఎస్‌బిసి నివేదిక ప్రకారం.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే కొనసాగుతుండటం దేశ ఆర్థిక గమనాన్ని దెబ్బతీస్తోంది. దీనికి తోడు ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి వాతావరణ మార్పులు ఆహార ద్రవ్యోల్బణాన్ని పెంచేలా కనిపిస్తున్నాయి. ఈ బహుళ సవాళ్ల కారణంగా గ్రామీణ కుటుంబాలు, చిన్న తరహా పరిశ్రమలు, వ్యవస్థీకృత రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని నివేదిక పేర్కొంది.

**వడ్డీ రేట్లు పెరగొచ్చు..**

ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉండటంతో దానిని అదుపు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చని హెచ్ఎస్‌బిసి విశ్లేషించింది. ముఖ్యంగా డిసెంబర్, మార్చి త్రైమాసికాల్లో ఆర్‌బిఐ రెండుసార్లు వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని అంచనా వేసింది. చమురు కంపెనీల నష్టాలను పూడ్చేందుకు పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.7 వరకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని పేర్కొంది. ఇది కూడా ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తుందని హెచ్చరించింది.

## వరుసగా 4రోజు తగ్గిన బంగారం, వెండి ధరలు.. తులం ఎంతుందంటే?

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, రూపాయి విలువ మారకంతో బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడూ మార్పులు వస్తుంటాయి. దానికితోడు తాజాగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో బంగారం కొనొద్దని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు కూడా వాటి షేర్లపై భారీ ప్రభావం చూపాయి. మోదీ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే మార్కెట్‌లో బంగారం షేర్లు భారీగా కుప్పకూలాయి. దీంతో బంగారం ధరల్లో కూడా మార్పులు రానున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే గత నాగులు రోజులుగా బంగారం, వెండి ధరలు వరుసగా తగ్గుతనూనే వస్తున్నాయి. కాబట్టి మంగళవారం తెలుగు రాష్ట్రాల సహా దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,120 గా ఉండగా నిన్న ఈ ధర 1,52,234గా ఉంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రామల బంగారం ధర చూసుకుంటే ప్రస్తుతం రూ.1,39,440 గా ఉండగా నిన్న ఈ ధర 1,39,640 గా ఉంది. ఇక ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో వెండి ధర చూసుకుంటే కేజీ వెండి ధర రూ.2,74,800 వద్ద



ట్రేడవుతుంది.

ఇక దేశ వ్యాప్తంగా ప్రధాన నగారల్లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,52,120గా ఉండగా నిన్న ఈ ధర 1,39,440 గా ఉంది. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర
రూ.1,39,640 ఉంది. వెండి కిలో ధర రూ.2,74,800గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

కోల్‌కత్తాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,52,120, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,39,440 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,53,810,గా ఉండగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,990గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,52,270, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ1,39,590 వద్ద కొనసాగుతుంది.ఇక వెండి వెండి ధరలు చూసుకుంటే దేశీ మార్కెట్‌లో కేజీ వెడి ధర రూ.రూ.2,74,800 గా ఉండగా హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,85,100 గా ఉంది

## హెరిటేజ్ ఫుడ్స్ ప్రాఫిట్ డౌన్

**న్యూఢిల్లీ,**

హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో సంస్థ రూ.23.94 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.38.16 కోట్ల లాభంతో పోలిస్తే 37 శాతం తగ్గింది.నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయంరూ.1,157.56 కోట్లకు ఎగబాకింది.

# స్పోర్ట్స్


## టిమ్ డేవిడ్‌కు భారీ జరిమానా..

ఐపీఎల్ లో గెలుపోటములు సహజమే అయినా, ఆటగాళ్ల ప్రవర్తన అనేది చాలా ముఖ్యం. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ ప్లేయర్ టిమ్ డేవిడ్ హద్దులు దాటి ప్రవర్తించాడు. ఈ మ్యాచ్ లో అతను డకౌట్ అయినప్పటికీ, డగౌట్ లో కూర్చుని తన టీమ్ ను ఉత్సాహపరిచాడు. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత అతను చేసిన ఒక అభ్యంతరకరమైన సైగ కెమెరాలకు చిక్కింది. గతంలో ముంబై ఇండియన్స్ కు ఆడిన డేవిడ్, ఇప్పుడు అదే టీమ్ పై గెలిచిన జోష్ లో తన ఫీలింగ్స్ ను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. టిమ్ డేవిడ్ ప్రవర్తన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.6ను ఉల్లంఘించినట్లు మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ నిర్ధారించారు. ఇది అశ్లీలమైన లేదా అభ్యంతరకరమైన సైగగా పరిగణిస్తూ, అతని మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా వేశారు. టిమ్ డేవిడ్ కూడా తన తప్పును ఒప్పుకోవడంతో వివాదం సద్దుమణిగింది. కానీ స్టార్ ఆటగాళ్లు ఇలాంటి పనులు చేయడం ఫ్యాన్స్ ను కాస్త నిరాశకు గురిచేసింది.ఈ మ్యాచ్ ఆద్యంతం నరాలు తెగే ఉత్కంఠతో సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 166 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సున్నాకే వెనుదిరగగా, దేవదత్ పడిక్కల్ 12



పరుగులకే అవుట్ అయ్యాడు. కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా 8 పరుగులకే వెనుదిరగడంతో ఆర్సీబీ 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కృనాల్ పాండ్యా ఇన్నింగ్స్ ను చక్కదిద్దాడు. క్రాంప్స్ (కండరాలు పట్టేయడం) ఇబ్బంది పెడుతున్నా లెక్కచేయకుండా 46 బంతుల్లో 5 సిక్సర్లు, 4 ఫోర్లతో 73 పరుగులు చేసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. బౌలింగ్ లో 4 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టిన భువనేశ్వర్ కుమార్, బ్యాటింగ్ లోనూ మెరిశాడు. ఆఖరి ఓవర్లో విజయానికి 15 పరుగులు కావాల్సిన సమయంలో భువీ ఒక సిక్సర్ బాది ఒత్తిడి తగ్గించాడు. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా, ఆర్సీబీ ఆ పరుగులు తీసి థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేసింది. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెట్లతో చెలరేగినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో ఆర్సీబీ 14 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లగా, డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ లీగ్ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ 18వ ఓవర్లో నమన్ ధీర్, తిలక్ వర్మ మధ్య జరిగిన మిస్ కమ్యూనికేషన్ వల్ల కృనాల్ పాండ్యా ఇచ్చిన క్యాచ్ మిస్ అయింది. ఆ ఛాన్స్ ను వాడుకున్న కృనాల్ వరుస సిక్సర్లతో మ్యాచ్ ను మలుపు తిప్పాడు. చివర్లో టిమ్ డేవిడ్ సున్నాకే అవుట్ అయినా, భువీ ఫినిషింగ్ టచ్ తో బెంగళూరు గెలిచింది. ఓవరాల్ గా ఈ మ్యాచ్ ఒక రోలర్ కోస్టర్ రైడ్ లా సాగింది. ఇటు ఆట పరంగా, అటు వివాదాల పరంగా ఈ సండే మ్యాచ్ క్రికెట్ లవర్స్ కు మంచి మసాలా అందించింది.

## చాలా మంది నా మసిల్స్‌పై కామెంట్లు చేశారు



భారత మహిళల క్రికెట్ స్టార్ స్మృతి మంధానా

ఈమధ్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో స్మృతి మంధానా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒకసారి తాను చేతులు స్పష్టంగా కనిపించే డ్రెస్ వేసుకున్నానని తెలిపింది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత చాలా మంది తన మసిల్స్‌పై కామెంట్లు చేశారని చెప్పింది.అథ్లెట్‌గా ఉండే వ్యక్తికి మసిల్స్ ఉండటం సాధారణమని, అది గర్వపడాల్సిన విషయమని స్మృతి తెలిపింది. "మేము ఫిట్‌గా ఉండేందుకు జిమ్‌లో చాలా కష్టపడతాం. మహిళా క్రీడాకారిణులు ప్రతిరోజూ ట్రైనింగ్ తీసుకుంటారు. శరీరం బలంగా ఉండాలి. ఫిట్‌నెస్‌ను ప్రశంసించాలి కానీ ట్రోల్ చేయకూడదు" అని ఆమె చెప్పింది.నాకు మంచి మసిల్స్ ఉన్నాయని కూడా ట్రోల్ చేశారు. అది చాలా ఫన్నీ విషయం" అని స్మృతి నవ్వుతూ చెప్పింది. ఆమె వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున మద్దతు లభించింది. చాలా మంది అభిమానులు ఆమె ధైర్యాన్ని ప్రశంసించారు.మహిళా అథ్లెట్లను వారి ప్రతిభ కంటే రూపం ఆధారంగా ఎక్కువగా జడ్జ్ చేస్తారని కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు. పురుష క్రికెటర్ల విషయంలో ఇలాంటి ట్రోలింగ్ చాలా తక్కువగా ఉంటుందని కూడా అభిప్రాయపడ్డారు. ఇది స్మృతి మంధానాకు మొదటిసారి ఎదురైన ట్రోలింగ్ కాదు. గతంలో బెంగళూరులో జరిగిన ఒక ఈవెంట్‌లో తీసిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అప్పట్లో కూడా కొందరు ఆమె రూపంపై నెగటివ్ కామెంట్లు చేశారు. అయితే అభిమానులు మాత్రం ఆమెకు బలంగా మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన స్మృతి మంధానా ప్రస్తుతం మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతోంది.

## మరో వివాదంలో షాహీన్ షా అఫ్రిది


పాకిస్థాన్ పేసర్ షాహీన్ షా అఫ్రిది మరో వివాదంలో చిక్కుకున్నాడు. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో ఢాకా వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో షాహీన్ అఫ్రిది బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నిస్తూ టీవీ కెమెరాలకు చిక్కాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. బౌలింగ్ చేసే సమయంలో అఫ్రిది.. బంతిని తన షూస్ కింద వేసి బలంగా నొక్కే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని గమనించిన అంపైర్ వెంటనే బంతిని చెక్ చేసి.. ఆకారం దెబ్బతినకపోవడంతో బౌలింగ్‌కు అనుమతిచ్చాడు. దాంతో అఫ్రిది ఆ ఓవర్‌ను పూర్తి చేశాడు. అయితే ఈ వీడియో నెట్టింట వైరల్ కాగా.. అఫ్రిదిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ టాంపరింగ్‌కు ప్రయత్నించిన అతనిపై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఫకార్ జమాన్ బాల్ టాంపరింగ్‌కు



ప్రయత్నించి దొరికిపోయాడు. అతనిపై నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. ఈ ఘటనను మరిచిపోకముందే మరో పాక్ ఆటగాడు బాల్ టాంపరింగ్‌కు యత్నించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. 268 పరుగుల లక్ష్యంతో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన పాకిస్థాన్ 121 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో సౌద్ షకీల్, మహమ్మద్ రిజ్వాన్ ఉన్నారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 413 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో (101), మోమినుల్ హక్ (91), ముష్ఫికర్ రహీమ్ (71) రాణించారు. పాకిస్థాన్ బౌలింగ్‌లో మహ్మద్ అబ్బాస్(5/92) ఐదు వికెట్లు తీయగా.. షాహీన్ షా అఫ్రిది 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులకు ఆలౌటైంది. ఇమామ్-ఉల్-హక్ (120), అబ్దుల్లా ఫజల్ (120) శతకాలతో రాణించారు. 27 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 240/9 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. నజ్ముల్ హుస్సేన్ షాంటో (87), మోమినుల్ హక్ (56) రాణించారు.

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ




మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



## వైట్ డ్రెస్ లో ఏంజిల్ లా నిధి అగర్వాల్

# ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ మూవీ

## మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల





జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఆఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.



# అలా అంటే నేను ఒప్పుకోను!

తెలుగమ్మాయి శ్రీలీలకు తమిళంలోనూ మంచి క్రేజే ఉంది. రీసెంట్‌గా 'పరాశక్తి' సినిమాతో తమిళ ప్రేక్షకుల్ని పలకరించింది శ్రీలీల. ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా.. ఈ తెలుగందానికి మాత్రం మంచి గుర్తింపే దక్కింది. రీసెంట్‌గా ఓ తమిళ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను డాక్టర్‌ని. అనుకోకుండా యాక్టర్‌ని కూడా అయ్యాను. ఈ రెండూ నాకు గర్వకారణాలే. ఈ క్రెడిట్ మా అమ్మవల్లే నాకు దక్కింది. జీవితంలో జయాపజయాలు సహజం. అపజయం ఎదురైనప్పుడు ఓ గంట ఏడుస్తాను. తర్వాత 'నెక్ట్స్' అంటూ రెడీ అయిపోతా. ప్రస్తుతం తెలుగు, తమిళంతో పాటు ఇప్పుడు హిందీలోనూ నటిస్తున్నా. అక్కడ నన్ను కొందరు లేడీ సూపర్‌స్టార్ అంటున్నారు. దానికి నేను ఒప్పుకోను. లేడీ సూపర్‌స్టార్ అంటే మా అక్క నయనతార మాత్రమే. నయన్ మాదిరిగా నేనూ తమిళం అబ్బాయినే పెళ్లాడతానేమో!' అంటూ చెప్పుకొచ్చింది శ్రీలీల. ఇంకా చెబుతూ 'విమానప్రయాణం చేసేటప్పుడు ల్యాండింగ్ అంటే నాకెంతో భయం. ల్యాండయ్యాక పైలెట్, ఇతర యూనిట్ మొత్తానికి షేక్‌హ్యాండిచ్చి ధన్యవాదాలు చెప్పాలని అమ్మ చెబుతుండేది. దాన్ని తూచ తప్పక పాటిస్తుంటా' అంటూ గుర్తు చేసుకున్నది శ్రీలీల. ప్రస్తుతం ఆమె ధనుష్‌కు జోడీగా ఓ సినిమాలో నటిస్తున్నది.

# కమల్-రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com